సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 20 । జూలై । 2024



అతిసారంతో అల్లాడుతున్నపల్లె

చాపాడు మండలం అల్లాడుపల్లె గ్రామం అతిసారం(డయేరియా)తో వణికిపోతోంది. కలుషిత నీరు తాగి నాలుగు రోజుల్లో 16 మంది ఆసుపత్రిలో చేరారు. -8లో



కడపలో వ్యక్తి దారుణ హత్య

కడపలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో బిల్టప్ సమీపంలో పుత్తా ఎస్టేట్స్‌లోని ఖాళీ ప్రదేశంలో చింపిరి వెంకటేశు (32) అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.2/27.8

జిల్లాలో శుక్రవారం 27.8 - 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 12.23 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

29, 30 తేదీల్లో ఏడీ సెట్-24 కౌన్సెలింగ్

ఏఎఫ్‌యూ: కడప నగరం లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు జూలై 29, 30వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏడీ సెట్ (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)-24 కన్వీనర్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ)లో పెయింటింగ్, శిల్పం, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమైన కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, ఆరు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. కౌన్సెలింగ్ రోజే సీట్లు కేటాయిస్తామని తెలిపారు.


దోమల నివారణకు చర్యలు



ఇందిరా నగర్‌లో ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ నాగరాజు, అధికారులు

కడప రూరల్: దోమల నివారణకు సమష్టిగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సదర్భంగా కడప ఇందిరాగ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వారానికోసారి ఇళ్లలోని తొట్లు, కుండలు, కూలర్లు శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కాచి చల్లార్చిన నీరు తాగి డయేరియాను నిర్మూలించుకోవాలని ఆయన సూచించారు. ఎవరికైనా పొడమచ్చలు ఉంటే ఆ వివరాలను ఏఎన్ఎంలకు తెలిజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పెన్నాసాగర్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వైవీయూ ఇన్‌చార్జి వీసీ



కె. కృష్ణారెడ్డి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య కె.కృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అకడమిక్‌గా, పరిశోధన పరంగా ముందుండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇస్రో, షార్ సంస్థల సహకారంతో రీసెర్చ్ హబ్‌గా విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని, అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పూర్వపు రిజిస్ట్రార్లు ఆచార్య డి.విజయరాఘవప్రసాద్, ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ఎం.రాజశేఖరరెడ్డి, డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి, శివప్రసాద్, బాషా, రాజశేఖర్, రమణారెడ్డి, మురళీగౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, యోగి, రామసుబ్బయ్య, దానం, ఆచార్యులు, అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ కేక్ కోసి వారితో కలిసి సంబరాలు చేసుకున్నారు.

ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్: ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లను ఏర్పాటుచేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. కడప కలెక్టర్ ఆఫీస్‌లోని స్పందన హాల్‌లో అధికారులు, ప్రధానోపాధ్యాయులకు కిచెన్ గార్డెన్ ఏర్పాటుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ కిచెన్ గార్డెన్ ఏర్పాటుచేయడంతో కలిగే లాభాలు, వాటి సంరక్షణ గురించి అందరూ తెలుసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కేవీకే, ఇతర వ్యవసాయాధికారులు కిచెన్ గార్డెన్ ఎలా ఏర్పాటుచేసుకోవాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి, ఉద్యానశాఖ డీడీ సుభాషిణి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ గంగిరెడ్డి హెచ్ఎంలు పాల్గొన్నారు.

పగబట్టిన పుట్టా

‘ఎన్నికల వరకే రాజకీయాలు, వర్గాలు, ఇకపై అభివృద్ధిపై దృష్టి పెట్టండి. స్థానికంగా చేపట్టాల్సిన పనులు గుర్తించండి.’ ఇటీవల తరచూ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చెబుతున్న మాటలివీ. అయితే ఆచరణలో మాత్రం తద్భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాను ఒక పక్షానికి మాత్రమే ఎమ్మెల్యే అన్న ధోరణిలో వ్యవహరిస్తూ వైరి పక్షాల ఆర్థిక మూలాలపై దెబ్బకొడుతున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీకి చెందిన రామాంజనేయులు కేబుల్ కనెక్షన్ ధ్వంసం చేయించారు. తన చేతులకు మట్టి అంటకుండా ట్రాన్స్‌కో యంత్రాంగాన్ని ముందు పెట్టి వ్యవహారం నడిపించారు.

–సాక్షి ప్రతినిధి, కడప

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి కేబుల్ కనెక్షన్ తొలగించాలని ట్రాన్స్‌కోకు ఆదేశం
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మైదుకూరు ఎమ్మెల్యే




వేంకటేశ్వర కేబుల్ నెట్‌వర్క్ వైర్లను విద్యుత్తు స్తంభాల నుంచి తొలగించిన ట్రాన్స్‌కో సిబ్బంది

నెట్లపల్లి రామాంజనేయులు 15 ఏళ్లగా వేంకటేశ్వర కేబుల్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని జీవీసత్రం, శ్రీరామనగర్, పెద్దశెట్టిపల్లి, లోకాయపల్లి, ఇందిరానగర్, జెఆర్.నగర్, తువ్వపల్లి, జండ్లవారం, వీఆర్వో కాలనీ, కూడళ్లు, వరదాయపల్లి గ్రామాల వినియోగదారులకు కేబుల్ ప్రసారాలు అందిస్తున్నారు. సుమారు రూ.20 లక్షల పెట్టుబడితో కేబుల్ వైర్లు ఆయా గ్రామాలకు లాగి ప్రసారాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకూ ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగిన కేబుల్ ప్రసారాలకు ఒక్కమారుగా అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు స్తంభాలకు కేబుల్ వైర్లు కత్తిరించి, ఎక్కడికక్కడ పడేశారు. ఎప్పుడూ లేనిది ఎందుకు ఇలా చేస్తున్నారంటూ రామాంజనేయులు ట్రాన్స్‌కో యంత్రాంగాన్ని ప్రశ్నిస్తే.. వారి నుంచి వింత సమాధానం ఎదురైంది. మా ఉద్యోగాలు కాపాడుకోవాలంటే మీ కేబుల్ వైర్లు పోల్స్ నుంచి తప్పించాల్సిందేనంటూ తేల్చి చెప్పారు.

అదేంటి సార్... విద్యుత్ పోల్స్ పై కేబుల్ వైర్లు ఉండడానికి అభ్యంతరమైతే డిమాండ్ నోటీసు ఇవ్వండి డబ్బు చెల్లిస్తానన్నా వారు స్పందించలేదు. అలా కుదరదు, మా ఉద్యోగాలు మాకు ముఖ్యం. ఎమ్మెల్యే సార్ మీకేబుల్ వైర్లు తీయించమన్నారు, తీసేస్తున్నామని ట్రాన్స్‌కో అధికారులు చెప్పడంతో అసలు విషయం వెలుగు చూసింది.

▶▶ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడని..

కేబుల్ ఆపరేటర్ నేటపల్లె రామాంజనేయులు సోదరుడు శివరాం ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌గా కూర్చున్నారనే అక్కసుతో ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే ఎత్తుగడను అవలంబించారనే ఆరోపణలున్నాయి. చెప్పేవి.. శ్రీరంగ నీతులు అన్నట్లుగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని ఈ సంఘటనతో రుజువైంది. ఒక్క విద్యుత్తు స్తంభానికి రామాంజనేయులు కేబుల్ వైర్లు ఉండకూడదని ఎమ్మెల్యే జారీ చేసిన హెచ్చరిక మేరకే తొలగించినట్లు ట్రాన్స్‌కో అధికారులు వెల్లడించడం విశేషం. పోనీ విద్యుత్ పోల్స్‌కున్న కేబుల్ వైర్లన్నీ తొలగించారా అంటే.. అదీ లేదు. ఒక్క రామాంజనేయులుకు చెందిన వేంకటేశ్వర కేబుల్ నెట్‌వర్క్ వైర్లు మాత్రమే తొలగించారు. రూ.20 లక్షల పెట్టుబడి పెట్టి జీవనోపాధి మార్గం ఎంచుకున్న తాను రోడ్డు పాలు కావాల్సి వస్తోందని బాధితుడు అధికారులకు విన్నవించినా వారికి దయ కలగలేదు. మా ఉద్యోగాలు ఉండాలంటే మీ కేబుల్ వైర్లు తొలగించాల్సిందేనంటూ ఎక్కడిక్కడ కింద పడేయడం విశేషం.



▶▶ ప్రజలు అభిమానం చూపినా...

మైదుకూరు తెలుగుదేశం అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్ రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పడంతో ప్రజలు అభిమానం చూపెట్టారు. ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో గెలిపించారు. ఆపై ప్రజా సేవకు అంకితమైతే సుదీర్ఘకాలం రాజకీయ మనుగడ లభిస్తుంది. అలాగాక రాజకీయ వైరి పక్షాలను టార్గెట్ చేయడమే లక్ష్యంగా పావులు కదపడం ఏమాత్రం సహేతుకం కాదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఎమ్మెల్యే కాకపోయినా 2014-19 టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ ఇన్‌ఛార్జిగా పుట్టా సుధాకర్‌యాదవ్ ఏకపక్షంగా వ్యవహరించి 2019 ఎన్నికల్లో అభాసుపాలయ్యారు. మరోమారు అలాంటి చర్యలే పునరావృతమవుతున్న తరుణంలో ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెబుతారనే సత్యాన్ని విస్మరించరాదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై సౌమ్యనాథుడి విహారం



చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు

నందలూరు: నందలూరులోని సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజున శుక్రవారం ఉదయం కూర్మాలంకారంలో సూర్యప్రభ వాహనంపై సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు మాఢ వీధుల్లో విహరించారు. ఆలయం ఎదురుగా ఉన్న సౌమ్యనాథ అన్నదాన ట్రస్టులో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

నేడు సౌమ్యనాథస్వామి కళ్యాణం

ఉమ్మడి కడప జిల్లాలోని నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో శనివారం ఉదయం పది గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కళ్యాణోత్సవం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున చలువ పందిళ్లు వేశారు. కళ్యాణ వేదికను సర్వాంగ సుందరంగా నిర్మించారు. వీవీపీలతోపాటు వేలాది మంది స్వామివారి కళ్యాణం వీక్షించేలా ఏర్పాట్లు జరిగాయి. తూర్పు గాలిగోపురం ద్వారా మాత్రమే భక్తులు ఆలయంలోకి ప్రవేశించల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.

ప్రాచీన కళకు ఆదరణ

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు పత్రం అందిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రాచీన కళ కోలాటానికి జీవం పోసి ఆదరణ కల్పించడం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని గోల్డెన్ పార్కులో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన సావిత్రిబాయి పూలే కోలాట బృందం సభ్యులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే బృందం ద్వారకా తిరుమలలో 222 మందితో కోలాట నృత్యం చేసి ఈ రికార్డు సాధించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ కోలాటం, చెక్కభజన వంటి సంప్రదాయ కళలను అందరికీ నేర్పించి భావితరాలకు అందించాలని కోరారు. కోలాటంలో నేర్పరితనం ప్రదర్శించి రికార్డు సాధించడం ప్రొద్దుటూరుకు గర్వకారణమన్నారు. సినీ నటుడు దావూద్ మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కోలాట బృందం వ్యవస్థాపకురాలు మల్లికకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రశంసా పత్రాలను కలెక్టర్, ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మొహిద్దీన్‌ఖాన్, చల్లా రాజగోపాల్, రామకృష్ణ భాగవతార్, రమణయ్య, డ్యాన్స్ మాస్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు భేష్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయని కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ఆస్పత్రిని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి, చిన్న పిల్లలు, ఎఫ్ఎం-1, ఎంఎం-1, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ వార్డులతోపాటు ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్, ఎక్స్‌రే, సిటీ స్కాన్ విభాగాలను ఆయన పరిశీలించారు. సరైన భోజనం పెడుతున్నారా..అని వార్డుల్లో రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ చాంబర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నెలకు 180 జరగడమంటే గొప్ప విషయమని, ఈ సారి 250కి పెరగాలని సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుకు సూచించారు. శానిటేషన్ ఇంకా మెరుగుపడాలని, పరికరాలు అవసరమైతే చెప్పాలని ఆయన కోరారు. అన్ని విభాగాల్లోనూ వైద్యులున్నారని, ఐదు నెలలుగా జీతాలు రాలేదని శానిటేషన్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు వచ్చేలా చూస్తానని కలెక్టర్ తెలిపారు.

కరుణించిన వరుణుడు

కడప అగ్రికల్చర్: వరుణుడు కరుణించడంతో జిల్లాలో శుక్రవారం ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కాశినాయన మండలంలో అత్యధికంగా 70.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పోరుమామిళ్లలో 58.2, బి.మఠంలో 31.2, పెద్దముడియంలో 19.8, దువ్వూరులో 18.2, రాజుపాలెంలో 16.8 బి.కోడూరులో 16.2, బద్వేల్‌లో 13.2, మైదుకూరులో 7, గోపవరంలో 6.4, అట్లూరులో 4.8, ఖాజీపేటలో 3.2, జమ్మలమడుగులో 2.4, ప్రొద్దుటూరులో 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

చాపాడు: మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మంచినీటి పైపులైన్ పరిశీలించి దెబ్బతిన్న వాటిని బాగు చేయించాలని సూచించారు. మురుగు కుంటలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, డ్రైనేజీ వ్యవస్థలను బాగు చేయించాలని ఆదేశించారు. ఇంటి పన్ను సర్వే వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ భాస్కర్, ఎంపీడీఓ రహంతుల్లయ్య, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి రుణాలపై సమావేశం

కడప రూరల్: స్త్రీ నిధి రుణాలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ అన్నారు. స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలోని ఛాంబర్‌లో స్త్రీనిధి రుణాల ప్రగతి, వసూళ్లు, జీవనోపాదుల ఏర్పాటుపై ఏడు కస్టర్ల స్త్రీనిధి మేనేజర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆ రుణాల దుర్వినియోగం జరిగితే చర్యలు చేపడతామని అన్నారు.డీ కార్యక్రమంలో స్త్రీ నిధి ఏజీఎం రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు







టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజీవలి, ప్రతాప్‌రెడ్డి, అబ్బాస్‌వలిలను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం: ప్రతి కార్యకర్తకు, నాయకునికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అండగా ఉంటారని..ఎవరూ అధైర్యపడవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం సింహాద్రిపురంలో ఎన్నికల కౌంటింగ్ అనంతరం టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలైన అబ్బాస్‌వలి, హాజీవలి, ప్రతాప్‌రెడ్డిలను మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరిగినా తక్షణమే ఆ గ్రామ నాయకులు సహాయ, సహకారాలు అందించి అండగా నిలబడాలని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, అరవిందనాథరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీటీసీ జాఫర్, సర్పంచ్ రామ్మోహన్, శివప్రసాద్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బషీర్, శ్రీనివాసులు రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పటేల్, రెడ్డి, సుభాష్ చంద్రబోస్‌రెడ్డి,కృష్ణారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుకున్న దుంగలు, స్మగ్లర్‌తో అటవీ అధికారులు

కడప అర్బన్ : కడప అటవీ డివిజన్ పరిధిలోని నాగసానిపల్లి బీట్, లంకమల్ల అభయారణ్యంలో ఇరగలశెల ప్రదేశం వద్ద అక్రమ రవాణా చేస్తున్న స్మగ్లర్ల నుంచి 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నాగసానిపల్లెకు చెందిన పీట్ల రామకృష్ణను అరెస్ట్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ గురు ప్రభాకర్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. పారిపోయిన మరి కొంత మంది స్మగ్లర్ల ఆచూకీ కోసం స్క్వాడ్ పార్టీలు గాలింపు చర్యలు చేపట్టాయని డీఎఫ్ఓ తెలియజేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ నయీం ఆలీ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ టి. నాగరాజు, ఎస్.ఖాజా రహంతుల్లా, ఎఫ్‌బీఓలు వెంకటేశ్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) వైఎస్ఆర్ కడప జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. శుక్రవారం కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా కొండా రమణారెడ్డి, కార్యదర్శిగా రాజు ఎన్నికయ్యారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి అధ్యక్షతన ఈ ఎన్నికలు నిర్వహించారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ఎన్నుకుంటామని ప్రకటించారు.

టమాట దొంగలు.. ఆందోళనలో రైతులు

- క్రేట్ ధర రూ.2 వేలు
- తోటల్లో చోరీకి గురవుతున్న కాయలు
- కాపలా కాస్తున్న రైతులు

గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా) : టమాట సాగు చేసిన రైతులకు ప్రస్తుతం ఓ వైపు ఆనందం, మరో వైపు భయం నెలకొంది. ఈ ఏడాది అత్యధికంగా 25 కేజీల క్రేట్ ధర రూ.2 వేల వరకు పలుకుతోంది. దీంతో జిల్లాలో పలు చోట్ల రాత్రిళ్లు తోటల్లో దొంగలు పడి టమాటలను దోచుకెళుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రూ.20 లక్షల విలువైన వాటిని ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

తగ్గిన దిగుబడి

జిల్లాలో ప్రస్తుతం 680 టన్నులకు దిగుబడి పడిపోయింది. గత నెలలో 1250 టన్నుల వరకు ఉండగా, ప్రస్తుతం దాదాపు సగానికి తగ్గిపోయింది. గతేడాది జిల్లాలోని అన్ని మార్కెట్‌యార్డుల పరిధిల్లో ఈ సీజన్‌లో 14 వేల నుంచి 15204 ఎకరాల్లో దిగుబడి వచ్చింది. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులు, ఎండలు, పంటకు సోకిన వివిధ రకాల వ్యాధులతో కాయలు దెబ్బతిన్నాయి. అయితే రాయలసీమ జిల్లాల్లో ఈ సీజన్‌లోనే ఈ ప్రాంతంలో ఎక్కువగా ఈ పంట సాగు చేస్తుంటారు. వేసవి కాలంలో అన్ని ప్రాంతాల కంటే మన జిల్లాలోని పడమటి ప్రాంతాలు (పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె)లలో వాతావరణం టమాట సాగుకు కొంత మేరకు అనుకూలంగా ఉంటుంది.

ఈ ఏడాది ఇవే అత్యధిక ధరలు

వారం రోజులుగా టమాట ధరలు భారీగా పంజుకొన్నాయి. 15 రోజుల కిందట 25 కేజీల క్రేట్ రూ.800 లోపే ఉండేది. ప్రస్తుతం రూ.2 వేల వరకు పలుకుతోంది. ఈ ఏడాది ఇవే అత్యధిక ధరలు. మన రాష్ట్రంతోపాటు బయటి రాష్ట్రాల్లో కూడా ఎక్కువగా టమాట పంటలు సాగు చేశారు. అయితే పలు కారణాలతో భారీగా దెబ్బతిన్నాయి. దీంతో రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో సాగు చేసిన టమాటలకు దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున డిమాండ్ ఏర్పడింది.


గుర్రంకొండ మండలం కొత్తపల్లెలో టమాట పండ్లను చోరీ చేయడంతో కాయలు మాత్రమే ఉన్న దృశ్యం

రూ.20 లక్షల టమాటలు చోరీ

జిల్లాలోని పలు ప్రాంతాల తోటల్లో కాయలు చోరీకి గురవుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రూ.20 లక్షల విలువ చేసే వాటిని దొంగలు ఎత్తుకెళ్లారు. రాత్రిళ్లు తోటల్లో చొరబడి కాయల్ని కోసుకెళుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతుల కళ్ల ముందే దోచుకెళ్తున్నారు. దొంగలు రాత్రి ఎనిమిది గంటలకే వచ్చి చెట్ల చాటున నక్కి కూర్చుంటున్నారు. రైతులు ఇళ్లకు వెళ్లిన తరువాత చోరీకి పాల్పడుతున్నారు. కొన్ని సార్లు దొంగలు తోటల్లో రైతుల కంట పడినప్పుడు పరారవుతున్నారు. దొంగల దగ్గర మారణాయుధాలు ఉంటాయేమోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే అరకొర పంట దిగుబడి రాగా ధరలు ఆశాజనకంగా ఉన్న సమయంలో కాయలు చోరీకి గురి అవుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. కొంత మంది ముఠాలుగా ఏర్పడి రాత్రిళ్లు టమాటలను చోరీ చేసుకెళుతుండటం గమనార్హం.


రాత్రి వేళ తోట వద్ద కాపలాగా ఉన్న రైతులు

పొలం నలువైపులా కాపలా

రైతులు పొలాల వద్దనే రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం నుంచి ఏడు ఎకరాల వరకు ఓ రైతు సగటున టమాట పంట సాగు చేశాడు. గతంలో టమాటలకు మంచి గిట్టుబాటు ధరలు ఉన్నా రైతులు పొలాల వద్ద కాపాలా ఉండేవారు కాదు. అయితే ప్రస్తుతం కొంత మంది పంట నలువైపులా గుడిసెలు వేసుకొని నలుగురు వ్యక్తులకు టార్చ్‌లైట్లు ఇచ్చి కాపలాగా ఉంచుకొంటున్నారు.

రెండేళ్లుగా చోరీలు

జిల్లాలో రెండేళ్లుగా ఈ చోరీలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పడమటి ప్రాంతాలైన పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోనే ఎక్కువగా టమాటలు చోరీకి గురయ్యాయి. అప్పట్లో దాదాపు రూ.40 లక్షల విలువైనవి చోరీకి గురయ్యాయి.

కళ్ల ముందే దొంగలు పడుతున్నారు



నేను, మా ఇద్దరు కుమారులు కలిసి మూడు ఎకరాల్లో టమాట సాగు చేశాము. మా కళ్ల ముందే తోటల్లో దొంగలు పడ్డారు. మాతోపాటు చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో పారిపోయారు. ప్రస్తుతానికి మా కుటుంబ సభ్యులతోపాటు మరో ఇద్దరిని కాపలాగా పెట్టుకున్నాం.

– రెడ్డెప్ప, రైతు, మర్రిమాకులపల్లె, గుర్రంకొండ మండలం

20 క్రేట్‌లు చోరీ చేశారు



రాత్రిళ్లు మా తోటలో దొంగలు పడి 20 క్రేట్ల టమాటలు చోరీ చేశారు. చాలా ఏళ్ల నుంచి మేము వ్యవసాయం చేస్తున్నాం. ఎప్పుడు కూడా ఏ పంటకు గానీ ఇలా కాపలా పెట్టుకోలేదు. పొలాల వద్దనే మంచాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నాం. రాత్రిళ్లు మరికొందరి సాయం తీసుకొని కాపలా ఉండాల్సిన పరిస్థితి.

– రమణమ్మ, రైతు, గుర్రంకొండ

డీఐజీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు : కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసు అధికారుల సమన్వయంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తామని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కర్నూలు రేంజ్ నూతన డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. నగరంలోని బి.క్యాంప్ రేంజ్ కార్యాలయంలో ఆయన శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడున్న విజయరావును అమరావతి హెడ్‌క్వార్టర్స్‌కు, గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న కోయ ప్రవీణ్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరానికి చెందిన ఈయన 2009 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. 2004లో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఈయన గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పార్వతీపురం, వరంగల్, విజయనగరం ఓఎస్‌డీగా, విశాఖపట్నం రూరల్ ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, కాకినాడ, ప్రకాశం జిల్లాల్లో సీపోర్టు డైరెక్టర్‌గా, గుంతకల్లు రైల్వే, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, 16వ బెటాలియన్ కమాండెంట్‌గా, ఆక్టోపస్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో ఎస్పీగా సేవలందించారు. సీమ జిల్లాల ఎస్పీలు జి.బిందు మాధవ్, ఆదిరాజ్‌సింగ్ రాణా, విద్యాసాగర్ నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మేకల మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు డీఐజీని మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు.

డీఐజీని కలిసిన ఎస్పీ

కడప అర్బన్ : కర్నూలు రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్‌ను కర్నూలులోని డీఐజీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీకి పూల మొక్కను అందజేశారు.

కడపలో వ్యక్తి దారుణ హత్య

- బాటిల్‌తో గొంతుపై పొడిచిన వైనం
- మనస్పర్థలే కారణం


చింపిరి వెంకటేష్ మృతదేహం


సంఘటన స్థలంలో మృతుని తండ్రితో ఫిర్యాదును స్వీకరిస్తున్న సీఐ తిమ్మయ్య

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో బిల్టప్ సమీపంలో పుత్తా ఎస్టేట్స్‌లోని ఖాళీ ప్రదేశంలో చింపిరి వెంకటేశు (32) అనే వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు, కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వివరాలిలా వున్నాయి. కడప నగరంలోని అంబాభవానీ నగర్‌లో నివాసం వుండిన కృష్ణ, వెంకట సుబ్బమ్మలకు కుమారుడు వెంకటేష్, మరో ఇద్దరు కుమార్తెలు సంతానం. వెంకటేష్ మెకానిక్, తరువాత బేల్దారి పనులను చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వెంకటేష్ ఆరేళ్ల క్రితం ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. తన భర్త జులాయిగా తిరుగుతూ, మద్యం సేవించి వేధిస్తుండటంతో అతనికి గత మూడేళ్లుగా దూరంగా వుంటోంది. వెంకటేష్, సాదిక్ వలీ అనే వ్యక్తికి మధ్య గతంలో మనస్పర్థలు వుండేవి. ఈ క్రమంలోనే వీరు ఇరువురు శుక్రవారం రాత్రి బిల్టప్ సమీపాన ఉన్న పుత్తా ఏస్టేట్స్‌లోని ఖాళీ ప్రదేశంలో కూర్చుని మద్యం తాగేందుకు వచ్చారు. మద్యం సేవించిన కొంత సేపటికి ఇద్దరి మధ్య మాటకుమాటా పెరిగి గొడవపడ్డారు. ఈ ఘర్షణలో సాదిక్‌వలీ తనకు అందుబాటులో వున్న మద్యం బాటిల్‌ను పగులగొట్టి, వెంకటేష్‌కు గొంతుభాగంలో ఒకవైపు పొడిచాడు. ఇంకా కొన్ని చోట్ల గాయపరిచాడు. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలను వదిలాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న కడప తాలూకా సీఐ తిమ్మయ్య, ఎస్ఐ మల్లికార్జున, ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రులు రాగానే వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ తిమ్మయ్య వివరాలను తెలియజేస్తూ చింపిరి వెంకటేష్‌పై కడప తాలూకా పరిధిలో రౌడీషీట్ వుందని, చిన్నచిన్న దొంగతనాలకు, నేరాలకు పాల్పడుతూ పోలీస్ రికార్డుల కెక్కాడన్నారు. వెంకటేష్‌కు, సాదిక్‌వలీకి మధ్య గతంలో మనస్పర్థలు వుండేవని, ఈ క్రమంలోనే గొడవపడి వెంకటేష్‌ను సాదిక్‌వలీ చంపేశాడని ప్రాథమిక సమాచారం ద్వారా తెలుసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం రిమ్స్ మార్చురీకి పంపించారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడి కోసం గాలింపు చర్యలను చేపట్టామన్నారు.

అతిసారంతో అల్లాడుతున్న పల్లె

- పెరుగుతున్న డయేరియా కేసులు
- వృద్ధురాలు మృతి, ఆసుపత్రిలో చేరిన మరో ఇద్దరు
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ, డీపీఓ


వీరమ్మ(ఫైల్)


అల్లాడుపల్లెలో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

చాపాడు : అల్లాడుపల్లె అతిసారం(డయేరియా)తో వణికిపోతోంది. రోజురోజుకు ఈ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఇప్పటికే నాలుగు రోజులుగా 16 మంది ఆసుపత్రిలో చేరగా, శుక్రవారం మరో ముగ్గురికి వచ్చింది. వీరిలో బాలయ్యపల్లి వీరమ్మ(68) అనే వృద్ధురాలు మృతి చెందారు. మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ గురువారం రాత్రి చాపాడులోని పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో బాగుందని ఇంటికెళ్లిన వీరమ్మ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఇదే క్రమంలో ఇదే గ్రామానికి చెందిన బాలుడు, మరో వ్యక్తి డయేరియాతో పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో మంచినీటి పథకానికి సంబంధించిన పైపులైన్ లీకేజీ కారణంగా నీరు కలుషితం కావటం వల్ల స్థానికులు డయేరియా బారినపడ్డారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. గ్రామంలోని కుళాయిల నంచి వచ్చే నీటిని పరీక్షించగా నీరు కలుషితమైనట్లు గుర్తించామన్నారు. వృద్ధురాలు వీరమ్మ కూడా డయేరియాతో బాధపడుతుండగా ఆసుపత్రిలో చికిత్స అందించామన్నారు. అప్పటికే ఆమెకు షుగర్, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నాయని, దీని కారణంగానే మృతి చెందిందని వైద్యాధికారి తెలిపారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పర్యవేక్షణలో గ్రామంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి డయేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పించారు.

గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ, డీపీఓ

అల్లాడుపల్లెను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయాలన్నారు. ఇదే క్రమంలో గ్రామంలో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా, కలుషితం కాని నీరు ప్రతి ఇంటికి అందేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ మండల అధికారులకు సూచించారు. ఇదే క్రమంలో గ్రామ ప్రజలతో మాట్లాడి పరిశుభ్రత, డయేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా కడప జట్టు


అండర్-14 చాంపియన్‌గా నిలిచిన కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బాలికల జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ వేదికగా నిర్వహించిన ఐసీఎస్ఈ ఏపీ, తెలంగాణ రీజియన్ బాలికల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది.

శుక్రవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో అండర్-14 విభాగంలో కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చాంపియన్‌గా నిలిచింది. రెండోస్థానంలో గీతాంజలి స్కూల్, మూడోస్థానంలో హబ్సిగూడకు చెందిన జాన్సన్ గ్రామర్ స్కూల్ నిలిచాయి. అండర్-17 విభాగంలో హబ్సిగూడ జాన్సన్ గ్రామర్ స్కూల్ చాంపియన్‌గా నిలువగా, రెండోస్థానంలో కడప హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ నిలిచింది. అండర్-19 విభాగంలో మల్లాపూర్ జాన్సన్ గ్రామర్‌స్కూల్ చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా కింగ్‌కోటికి చెందిన సెయింట్ జోసఫ్ స్కూల్ నిలిచింది. విజేతలకు కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్నల్ ఎ.శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, హెచ్ఎం రహమతుల్లాలు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కల్యాణ్, తిరుమలశెట్టి ప్రసాద్, భీమా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బీచ్ కబడ్డీ ఎంపికలు


జిల్లా బీచ్ కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో క్రీడా సంఘాల ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బీచ్ కబడ్డీ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలకు వైఎస్ఆర్ క్రీడా పాఠశాల మాజీ ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం. రామచంద్రారెడ్డి, వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడ కబడ్డీకి ఆదరణ పెరుగుతోందన్నారు. క్రీడాకారులు అంకితభావం, పట్టుదలతో సాధన చేయాలని సూచించారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, కబడ్డీ కోచ్ ఆర్.వి. శ్రీధర్, కబడ్డీ సంఘం వర్కింగ్ సెక్రటరీ టి. శ్రీవాణి, జాయింట్ సెక్రటరీ సునీల్, సీనియర్ క్రీడాకారులు గిరి, నిత్యప్రభాకర్, సుబ్బన్న, అరుణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ సాధనకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న యువజన సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం యువత ఉద్యమించాలని యువజన సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా స్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన హామీల్లో చెప్పిన మేరకు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. త్వరలో జరగనున్న కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నిధులు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. జిల్లాలో కరువు, వలసల నివారణకు ఉక్కు పరిశ్రమ స్థాపనే ఏకైక మార్గమన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను 25 వేల పోస్టులతో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్ని, శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, డేవిడ్, జిల్లా సహాయ కార్యదర్శులు తులసి, అంజి, జిల్లా కమిటీ సభ్యులు విజయ, విశ్వనాథ్, మహేష్, మహిళా కన్వీనర్ గురుదేవి, నాగలక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రాంతాల డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘర్షణ.. కేసు నమోదు

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామ పంచాయతీ బాలతిమ్మయ్యగారిపల్లెలో శుక్రవారం స్థలం కోసం జరిగిన ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. ఈ ఘర్షణలో తుడుము లదిన్నె ఓబులేసుకు గాయాలు అయ్యాయని పేర్కొన్నారు. ఓబులేసు ఫిర్యాదు మేరకు ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓబులేసుతోపాటు ఆయన భార్య రమాదేవి ఇంటి నిర్మాణ పనులను చేసుకుంటుండగా ప్రహ్లాద, ఓబులేసు, రెడ్డిప్రసాదు, క్రిష్ణమూర్తి, అమర వచ్చి అడ్డుపడి కట్టెలు, రాళ్లతో దాడి చేశారని చెప్పారు. ఈ మేరకు ఐదుగురిపైన కేసు నమోదు చేసి ఓబులేసును ఆస్పత్రికి పంపినట్లు ఆయన తెలిపారు.

కార్గో ఆదాయం పెంపునకు కృషి చేయాలి


కార్గో ఏజెంటుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజల వస్తు సామగ్రి నమ్మకానికి, భద్రతకు మారుపేరుగా నిలుస్తున్న ఆర్టీసీ కార్గో ద్వారా వస్తున్న ఆదాయ పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. కడపలోని ఆర్ఎం కార్యాలయంలో జోన్ పరిధిలోని ఎనిమిది జిల్లాల కార్గో ఆదాయంపై శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ జూన్ నెలకు సంబంధించి లక్ష్యం రూ.7.04 కోట్లకు గాను రూ.3.79 కోట్లు సాధించి 54 శాతంగా నిలువడం జరిగిందన్నారు. ఏటీఎం (కమర్షియల్), ఆర్ఎంఈ, డీఎం, ఏపీబీ ఏజెంట్ల కార్గోపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ అంశంపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం కాదన్నారు. కడపజోన్ కార్గో ఆదాయంలో 32 శాతం ఏపీబీ ఏజెంట్ల ద్వారా వస్తుండడం శుభసూచకమన్నారు. ఈ క్రమంలో కార్గో ఆదాయ పెంపునకు కృషి చేసిన ఏజెంట్లు మహబూబ్‌బాష (బళ్లారి), కేఎం భవాని ప్రసాద్(కుప్పం)కు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్గో అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

పూర్వపు ఆర్‌జేడీపై ముగిసిన విచారణ

- ప్రభుత్వానికి వారంలో నివేదికలు
- ఏపీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ప్రసన్న కుమార్


ఆర్‌జేడీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏపీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ప్రసన్న కుమార్

కడప ఎడ్యుకేషన్ : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వపు ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై రెండు రోజుల విచారణ శుక్రవారంతో ముగిసింది. విచారణ అధికారిగా నియమితులైన ఏపీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్ మొదటి రోజు గురువారం కడపలోని డీఈఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన డీఈఓగా పని చేసిన కాలంలో రాఘవరెడ్డి చేసిన బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతోపాటు డీఈఓ కార్యాలయ సిబ్బందితోపాటు డీఈఓ మర్రెడ్డి అనురాధలను విచారణ చేశారు. అలాగే బాధిత యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు విచారణ చేసి, వారి నుంచి నివేదికలు తీసుకున్నారు. రెండవ రోజు శుక్రవారం ఆర్‌జేడీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆర్‌జేడీగా రాఘవరెడ్డి పని చేసిన సమయంలో పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో పూర్తి చేయకపోవడం, తప్పులు చేసిన వారికి సకాలంలో పనిష్మెంట్స్ ఇవ్వకుండా నాన్చడం వంటి కొన్ని కేసులు గుర్తించినట్లు ఆయన తెలిపారు. అలాగే కొంత మంది బాధితులు, యూనియన్ నాయకులను విచారణ చేసి వారి నుంచి నివేదికలను తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌జేడీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను క్షుణంగా పరిశీలించినట్లు తెలిపారు.

పెండింగ్ కేసులన్నీ పరిష్కరించాలని ఆదేశం

పూర్వపు ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై రెండు రోజుల విచారణ పూర్తయిందని ఏపీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విచారణకు సంబంధించిన నివేదికలను వారం రోజుల్లో పూర్తి చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఆర్‌జేడీ కార్యాలయంలో క్రమశిక్షణా చర్యలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ అన్నీ మూడు నెలల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. అలాగే కోర్టులో ఉన్న కేసులు మినహా మిగతా అన్ని కేసులన్నీ పరిశీలించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. తప్పు చేసిన వారికి పనిష్మెంట్‌ను కూడా ఇవ్వాలని ఆదేశించామన్నారు.

ఎంఈఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులకు షోకాజ్‌నోటీసులు

గురువారం పిలవకపోయినా డీఈఓ కార్యాలయంలో జరిగిన విచారణకు వచ్చిన అన్నమయ్య జిల్లా సుండిపల్లె ఎంఈఓ వెంకటేష్‌నాయక్, జంగ్రిపల్లె హైస్కూల్ హెచ్ఎం రామకృష్ణ, కె.రామాపురం హైస్కూల్ హెచ్ఎం నాగమునిరెడ్డి, మాసాపేట హైస్కూల్ హెచ్ఎం శివకుమార్‌రెడ్డిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆర్‌జేడీని ఆదేశించినట్లు ప్రసన్నకుమార్ తెలిపారు. అలాగే సుండుపల్లి, మంగపేట ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీలుగా పని చేస్తున్న వెంకటేష్, ఆదినారాయణరెడ్డిలు సెలవు పెట్టకుండా విచారణకు హాజరైనందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా డీఈఓను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విచారణ కార్యక్రమంలో ఆర్‌జేడీ కార్యాలయ ఏడీ అరుణకుమార్ పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో సెక్యూరిటీ ఆడిట్

సిద్దవటం : మండల పరిధి భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్‌లో శుక్రవారం సెక్యూరిటీ ఆడిట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ ఇక్కడ ఆడిట్ 2 ఏళ్లకు ఒకసారి జరుగుతుందన్నారు. హెచ్‌పీసీఎల్ పరిసరాలను టెలివిజన్ ద్వారా చూపించారన్నారు. హెచ్‌పీసీఎల్‌లో సెక్యూరిటీ ఎంత మంది ఉన్నారని, పెట్రోల్ బంక్‌లు ఎన్ని ఉన్నాయని హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. గతంలో సీసీ కెమెరాలు 18 ఉన్నాయని, వాటిని పెంచాలని సూచించామన్నారు. అవి ఇప్పుడు 57 పెంచారన్నారు. ఇంకా బయట హైవే రోడ్డులో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఇక్కడ భూ విషయం ఏమైనా ఇబ్బంది ఉందా అని తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు. హెచ్‌పీసీఎల్ డాబా వద్ద నివాస గృహాలు, కొత్త కట్టడాలు లేకుండా చూడాలని జనరల్ మేనేజర్ సతీష్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మాక్ డ్రిల్ చేసేటప్పుడు మెడికల్ టీమ్, ఫైర్‌టీమ్, రెవెన్యూ టీమ్, పోలీసులు అందరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, తహసీల్దారు మురాషావలి, ఎస్ఐ పెద్దఓబన్న, ట్రాన్స్‌కో ఏఈ జయచంద్ర, వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఆర్ఐ అనూరాధ, వీఆర్వో నాని, హెచ్‌పీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.